క్లుప్తంగా

బీఆర్ఎస్‌కు రాజీనామా


రాజీనామా ప్రకటిస్తున్న నాయకులు

వీణవంక: మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసారపు ప్రభాకర్, మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు హమీద్, మాజీ ఉపసర్పంచ్ సమ్మిరెడ్డి తదితరులు శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఆగడాలు భరించలేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌కు నిబద్ధతతో పని చేశామన్నారు. కానీ, తమపై బీజేపీ ముద్ర వేశారని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలతో చర్చించి, త్వరలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నాయకులు అమృత ప్రభాకర్, చిట్టి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాల స్ఫూర్తితో పోరాడుదాం

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థి అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో పోరాడుదామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కాలేజీలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూ ఎన్నో పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. నాయకులు నవీన్, సంపత్, కళ్యాణ్, రంజిత్, శ్రావణ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన నియామకం


నియామక పత్రం అందుకుంటున్న సంతోష్‌కుమార్ యాదవ్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన కూకట్ల సంతోష్‌కుమార్ యాదవ్ భారత్ జాగతి నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ శనివారం ఆయనకు నియామక పత్రం అందించారు. తనను నియమించిన జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితకు, సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు సంతోష్‌కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

15 మంది బైండోవర్

వీణవంక: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మంది పాత నేరస్తులను స్థానిక తహసీల్దార్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అందరూ పాటించాలి

జమ్మికుంట: ఎన్నికల నియమావళి అందరూ పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో కేంద్ర బలగాలు, పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా తనిఖీలు చేస్తున్నామని, నగదు, ఆభరణాలు తీసుకెళ్తే సంబంధిత పత్రాలు వెంట ఉండాలన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబుబ్బలు తరలిస్తే సీజ్ చేస్తామని, నియమ నిబంధనలకు పాటించాలని సూచించారు. ఎస్సైలు శ్రీధర్, రాజేశ్, ఏఎస్సైలు రాధాకృష్ణ, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురిపై వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట: వరకట్న వేధింపులకు పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. మడిపల్లికి చెందిన అనూషకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి చెందిన కడారి రాజుతో ఐదేళ్లక్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో కట్నం రూపంలో రూ.8 లక్షలు, ఇతర లాంఛనాలు అప్పగించారు. కొద్దిరోజులుగా అదనపు కట్నం తేవాలని భర్త రాజు, అత్త భాగ్య, ఆడబిడ్డ రజిత, ఆమె భర్త సంతోష్ వేధిస్తున్నారని అనూష శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.


హుజూరాబాద్‌రూరల్: తుమ్మనపల్లి ఏకశిల పాఠశాలలో ఎకో ఫ్రెండ్లీ దీపావళి

అనువైన స్థలమేది? ఆటలేవి?

- చెరువులు, కుంటలు, శ్మశానవాటికల వద్ద..
- కొన్నిచోట్ల పాఠశాలల్లోనూ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- బోర్డులు పాతి వదిలేసిన అధికారులు
- ఒక్కటీ వినియోగంలో లేదు
- సైదాపూర్ మండలంలో దుస్థితి



వెన్నంపల్లి గై చెరువులో ఆరెపల్లి క్రీడా ప్రాంగణం

సైదాపూర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ఆటల్లో ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో క్రీడాప్రాంగణం నిర్మించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం అన్ని పల్లెల్లో స్థల సేకరణ చేపట్టి, ఆయా స్థలాలను చదును చేయాలని సూచించింది. ఈ మేరకు తహసీల్దార్ల అనుమతితో స్థల సేకరణ చేసి, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి. కానీ, కలెక్టర్ ఒత్తిడి మేరకు సైదాపూర్ మండల అధికారులు మండలంలోని 26 గ్రామాల్లో క్రీడామైదానాలను ఏర్పాటు చేశామంటే చేశామన్నట్లు బోర్డులు పాతి వదిలేశారు. వీటిలో ఒక్కటి కూడా ప్రస్తుతం వినియోగంలో లేదు. దీంతో విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు.

రోడ్డు పక్కన.. గుట్టపైన

సైదాపూర్ మండలంలో ఎక్కడ వీలైతే అక్కడ తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం అని బోర్డులు పాతారు. కొన్ని పల్లెల్లో పాఠశాలల మైదానంలోనే ఇవి కనిపిస్తున్నాయి. సూకల్ స్థలం లేని మరికొన్ని పల్లెల్లో చెరువులు, కుంటలు, శ్మశాన వాటికల పక్కన క్రీడామైదానాలుగా ఏర్పాటు చేసి, బిల్లులు కాజేశారన్న ఆరోపణలున్నాయి. ఆరెపల్లికి కిలోమీటర్ దూరంలో ఉన్న వెన్నంపల్లి గై చెరువు శిఖాన్ని మైదానంగా చూపించారు. పక్కనే డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక ఉన్నాయి. ప్రస్తుతం ఈ క్రీడాప్రాంగణం చెరువులో మునిగింది. బోర్డు మాత్రమే కనిపిస్తోంది. జాగీర్‌పల్లిలో గుట్టపైన ఏర్పాటు చేశారు. ఓవైపు క్వారీ, మరోవైపు క్రషర్ నడుస్తున్నాయి. బోర్డు పాతి, క్రీడాప్రాంగణం అన్నారు. ఎల్లంపల్లిలో రోడ్డు పక్కన చాలా తక్కువ స్థలంలో బోర్డు పెట్టి, క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు, పాలకులు నీరుగార్చారని మండల ప్రజలు అంటున్నారు.

ప్రజాధనం దుర్వినియోగం



సైదాపూర్ మండలంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఒక్కటీ ఉపయోగకరంగా లేదు. అవి ఆటలకు అనువైన చోట లేవు. అధికారులు, సర్పంచ్‌లు బోర్డులు పాతి, చేతులు దులుపుకున్నారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగమైంది. చెరువులు, కుంటల్లో, గుట్టలపై స్థలం లేకున్నా బోర్డులు పెట్టారు. ప్రస్తుతం అవి గడ్డి, నీళ్ల, ముళ్ల పొదలతో భయంకరంగా కనిపిస్తున్నాయి.

– జున్నూతుల భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్, గొడిశాల

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి



నిరుపయోగ క్రీడా ప్రాంగణాలకు బదులు గ్రామ గ్రామాన ఓపెన్ జిమ్‌లు ఉండాలి. పాఠశాలల మైదానాలు, ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారు రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తున్నారు. అనువైన స్థలం లేకపోవడంతో రోడ్లపై వాకింగ్ చేస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బిల్లం గణేశ్, వార్డు సభ్యుడు గణపూర్

గౌడ కులస్తుల అభ్యున్నతికి ‘దేశిని’ కృషి

- కాంగ్రెస్ హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్


మాట్లాడుతున్న ప్రభాకర్ గౌడ్

చిగురుమామిడి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే దివంగత దేశిని చిన్నమల్లయ్య అని మాజీ ఎంపీ, కాంగ్రెస్ హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కొనియాడారు. శనివారం చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లిలో చిన్నమల్లయ్య ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్‌తో కలిసి పని చేశారని గుర్తు చేశారు. ఆయన అనారోగ్యంతో మరణిస్తే కేసీఆర్ కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదని ఆరోపించారు. దేశిని 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ప్రజలతో మమేకమై పని చేశారని పేర్కొన్నారు. గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు మిట్టపెల్లి ఆదర్శ్, నాయకులున్నారు.

సైదాపూర్ బీసీ గురుకులం ఎక్కడ?

- డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కొండాల్‌రెడ్డి

సైదాపూర్: మండలానికి వచ్చిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ఎక్కడ ఉందో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన సైదాపూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఈ పదేళ్లలో మండలంలో చేసిన అభివృద్ధి పనులు ఏమిటో చెప్పాలన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మండలంలో తారు రోడ్లు, దుద్దెనపల్లి బ్రిడ్జి, ఆకునూర్ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, సోమారంలో మోడల్ స్కూల్ అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంజూరు చేయించి, పనులు పూర్తి చేయించారని తెలిపారు. మండల కాంప్లెక్స్ భవనాలు నిర్మించారన్నారు. సైదాపూర్ మండలానికి బీఆర్ఎస్ హయాంలో వచ్చిన ఒక్క గురుకుల పాఠశాల కూడా పక్క నియోజకవర్గానికి తరలిపోయిందని పేర్కొన్నారు.

విశ్వరూప సభకు తరలివెళ్లిన నాయకులు


హైదరాబాద్ వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మికుంట: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన మాదిగ విశ్వరూప బహిరంగ సభకు జమ్మికుంట పట్టణం, మండలంలోని గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. సమితి సీనియర్ నాయకుడు దొగ్గల భాస్కర్ మాట్లాడుతూ.. విశ్వరూప సభలో ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇవ్వబోతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టంతో మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగి తద్వారా అభివృద్ధికి పునాదులు పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, కొంరయ్య, సంపత్, ఓదెలు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1.02 లక్షలు, మద్యం పట్టివేత


నగదు చూపుతున్న పోలీసులు


మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హుజూరాబాద్: పట్టణ శివారులోని పరకాల క్రాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం తనిఖీల్లో భాగంగా నగదు పట్టుబడినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తున్న రూ.1,02,500ను సీజ్ చేసినట్లు తెలిపారు. రశీదులు లేకుండా నగదును తరలిస్తే సీజ్ చేస్తామని వివరించారు.

తిమ్మాపూర్: అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ అన్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్ది శివకుమార్ తన ద్విచక్ర వాహనంపై 26మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపరుచుకుని కేసు న మోదు చేసినట్లు సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు సరిత, శ్రీకాంత్ సిబ్బంది రాజేశం, కొండల్‌రెడ్డి, నరేశ్, సురేశ్, రజిత పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం


మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ చేసిన సుమారు రూ.8000 కోట్ల అభివృద్ధి పనుల వివరాలను తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేశ్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లు బీజేపీ జిల్లా పదాధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. అనవసరంగా ఎంపీపై వ్యాఖ్యలు చేసే బీఆర్ఎస్ నాయకులు, మంత్రి, మేయర్‌లకు చర్చకు సిద్ధం కావాలని, తేదీ, సమయం, వేదిక ఖరారు చేస్తే మీడియా సాక్షిగా వివరాలు ఇస్తామని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి, అభివృద్ధి కోసం ఆలోచన చేసే బండి సంజయ్ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు, మేయర్ సునీల్‌రావుకు లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, కార్పొరేటర్లు దుర్శెట్టి అనుప్, రాపర్తి విజయ, కోలగని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, బండ రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవదుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండగొస్తే అవస్థలే..!

- రోడ్డు మీదనే దీపావళి ప్రత్యేక దుకాణాలు
- రద్దీగా మారుతున్న కరీంనగర్ మార్కెట్, టవర్ సర్కిల్ ప్రాంతాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


కరీంనగర్ మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ జాం

కరీంనగర్‌క్రైం: పండగ వచ్చిందంటే చాలు మార్కెట్‌లోకి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ధనత్రయోదశి, దీపావళి పండుగ ఉండడంతో రెండు మూడు రోజుల నుంచే మార్కెట్‌ల్లో రద్దీ మొదలైంది. ఏ పండుగలు వచ్చిన పండుగకు సంబంధించిన ప్రత్యేక వ్యాపారులు, రైతులు రోడ్ల మీదనే తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలో రద్దీ ఏర్పడుతోంది. వాహనాదారుల వాహనాలు లోపలికి పోలేక బయటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు.

మార్కెట్లో ట్రాఫిక్‌జాం

దీపావళి సందర్భంగా పండుగకు కావాల్సిన సామగ్రి, దీపాలు, వత్తులు, మామిడాకులు, ఇతర వస్తువులన్నీ కావాలని వేల సంఖ్యలో జనం ప్రధాన కూరగాయాల మార్కెట్, ప్రకాశం గంజ్, టవర్ సర్కిల్ ప్రాంతానికి వెళ్తుంటారు. దీపావళితో పాటు ప్రతీ పండుగకు ఇక్కడ ప్రత్యేక దుకాణాలు వెలుస్తుండడంతో అందరూ మార్కెట్ ప్రాంతానికి వెళ్తున్నారు. ఒకేరోజు వేల సంఖ్యలో వెళ్తుండడంతో పార్కింగ్‌తో పాటు దుకాణాలు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తున్నాయి. సాధారణ రోజుల్లోనే రద్దీగా ఉండే ఈ ప్రాంతం పండుగ వస్తే వాహనాల మీద వెళ్లాలంటే జంకుతున్నారు. నడుచుకుంటూ కూడా పోలేని పరిస్థితి ఏర్పడుతుందని నగరవాసులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టినా వాహనదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సరైన ఫలితం ఉండడం లేదు. పండుగ సామగ్రి కొనుగోలు చేసి బయటకు వచ్చి అందరూ హమ్మయ్య బయటకు వచ్చేసామని అనుకుంటున్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి


మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు


వన్నారంలో సాయుధ బలగాలు..

- కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- తిమ్మాపూర్, వన్నారంలలో సాయుధ బలగాల కవాతు

తిమ్మాపూర్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు తిమ్మాపూర్ మండల కేంద్రంలో సాయుధ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్‌ఏసీపీ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలని సూచించారు. రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు పడొద్దని పేర్కొన్నారు. డబ్బు, మద్యం, వస్తువులు పంపిణీ చేసినా, నిల్వ చేసినా తమకు గానీ, ఎన్నికల అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలని కోరారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. అలాగే, తమకు అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా కేసులు లేని మండలమని తిమ్మాపూర్‌కు పేరు తీసుకురావాలని సూచించారు.

పలువురికి కౌన్సెలింగ్..

గ్రామాల్లో వివిధ షీట్లలో ఉన్న వారితోపాటు తరచూ గొడవలకు పాల్పడే, బైండోవర్ అయిన వారికి ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. నిత్యం పోలీసులు గ్రామాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారని, వారి దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా ఎన్నికల అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. కవాతులో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు వితిన్ సింగ్, అబయ్ సింగ్, తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్, రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, చొప్పదండి సీఐ గోపతి రవీందర్, ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి, రూరల్ డివిజన్ ఎస్సైలు నరసింహారావు, రాజేశ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, తిరుపతి, అభిలాశ్, ఉపేంద్రాచారి, పోలీసు, సాయుధ బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

వన్నారంలో గ్రామంలో..

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామంలో శనివారం సాయంత్రం కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. చొప్పదండి సీఐ రవీందర్, ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘ఎస్‌ఆర్‌ఎం’లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంటలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులపై శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు వివరించారు. చైర్మన్ తిరుపతి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్‌తో ఆ వర్గాల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తోందని డీసీసీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజొద్దిన్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు ముల్కల ప్రవీణ్‌లు అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు మైనార్టీల ద్రోహులని విమర్శించారు. వాటికి గుణపాఠం చెప్పాలని కోరారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి


అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి(కరీంనగర్): మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా శనివారం రేకుర్తిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరీంనగర్ ఆర్ఎల్‌సీ సురేశ్ మాట్లాడుతూ.. అబుల్ కలాం చేసిన సేవలను కొ నియాడారు. విద్యార్థుల అడ్మిషన్లు పెంచడంతో తల్లిదండ్రులు సహకరించాలని, ప్రభుత్వం కల్పిస్తు న్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మోనికా సోని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా కల్వల రాంచందర్


నియామకపత్రం అందిస్తున్న సత్యనారాయణ

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన కల్వల రాంచందర్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నియామకఉత్తర్వులు జారీ చేశారు. కాగా తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్యకు రాంచందర్ కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899